క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అందరూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులతో పాటు అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

జూదరుల అరెస్టు

నాగులుప్పలపాడు: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 48,570 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. ఎస్సై సమాచారం మేరకు నాగులుప్పలపాడులో మంగళవారం రాత్రి ఒక ఇంట్లో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసు సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులతో పాటు నగదు లభ్యమైనట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు


గుండా శ్రీనివాసరావు

చీమకుర్తి: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చీమకుర్తికి చెందిన గుండా శ్రీనివాసరావును నియమించారు. జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు తనను ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు మంగళవారం చీమకుర్తిలో మీడియాకు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న గుండా శ్రీనివాసరావు సేవలు పార్టీకి తోడ్పడతాయనే విశ్వాసంతో జిల్లా నాయకులు తనను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, అభిమానులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌కు సమస్యల స్వాగతం


ఈఓఆర్డీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ముండ్లమూరు (దర్శి): మండలంలో కెల్లంపల్లిలో మంగళవారం పర్యటించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు గ్రామస్తులు తమ సమస్యలు ఆమె ముందు ఉంచారు. తాగు నీరు అందడం లేదని, ఫ్లోరైడ్ వాటర్ తాగి రోగాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ అధికంగా ఉండటంతో మొక్కలు కూడా బతకడం లేదని కలెక్టర్‌కు చెప్పి వాపోయారు. గ్రామాల్లో పారిశుధ్యం పనుల బాగా చేయలేదని ఈఓఆర్డీ జనార్దన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఈదర, ఉల్లగల్లు మినహాయించి 21 పంచాయతీల్లో ఎక్కడా చెత్తతో సంపద సృష్టి జరగడం లేదని మండిపడ్డారు. తీరు మార్చుకోకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా పారిశుధ్యం బాగా లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్


గణేష్ కుటుంబాన్ని ఓదారుస్తున్న కలెక్టర్

కెల్లంపల్లిలో అంజలి కుటుంబాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణ దత్తత తీసుకున్నారు. వికలాంగుడైన గణేష్‌తో పాటు మరో ముగ్గురు పిల్లలకు అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో శ్రీనివాసరావు అనే వ్యక్తి పది కుటుంబాలను దత్తత తీసుకున్నారు. శ్రీనివాసరావుతో పాటు తహసీల్దార్‌ను కలెక్టర్ అభినందించారు. తాము కూడా అంజలి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు.


సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండు

బస్సులు రాక.. ఇబ్బందులు తప్పక!

- ఒక్క బస్సు పాయింట్‌లోకి రాదు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): పేరుకే బస్టాండ్.. ఒక్క బస్సు కూడా పాయింటులోకి రాదు. సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. బస్సులన్నీ ఒంగోలు-కర్నూలు రహదారిపై కొన్ని నిమిషాలు పాటు ఆగి ఎగువ ప్రాంతానికి వెళ్తుంటాయి. సంతనూతలపాడులో ఆర్టీసీ బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు బస్టాండ్ విడిచి అవతల వైపు ఒంగోలు-కర్నూలు రహదారి మార్జిన్ ప్రాంతంలో వేచి ఉండాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వృద్ధులు వేసవిలో తట్టుకోలేక స్పృహతప్పి పడిపోతున్నారు. ప్రస్తుతం సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ లీజు పద్ధతిలో కొనసాగుతోంది. ఇక్కడి నుంచి గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో నిర్జీవంగా ఉంది. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఒంగోలు, చీమకుర్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ బస్టాండు పాయింట్లోకి వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.


బస్టాండు ఆవరణలోనికి వెళ్లని బస్సులు

కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): వ్యవసాయ కార్మికుల హక్కుల రక్షణ కోసం ఉద్యమాలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని బీ మాచవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘం మండల తొమ్మిదో మహాసభకు అన్నవరపు శేషరావు మదిరాల సుశీల అధ్యక్షత వ్యవహరించగా సభకు ముఖ్య అతిథులుగా ఆంజనేయులు హాజరై మాట్లాడారు గ్రామీణ సమాజంలో సంపద సృష్టికి మూల కారకులైన వ్యవసాయ కార్మికుల హక్కుల రక్షణ కోసం సమరశీల ఉద్యమాలు సాగించాలన్నారు. మండలంలోని గ్రామీణ వ్యవసాయ రంగం పాలకుల విధానాల వల్ల సంక్షోభంలోకి కూరుకుపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు, వరి, మిర్చి, శనగ, మొక్కజొన్న, సుబాబుల్ జామాల్ లాంటి పంటలు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనికి ప్రధాన కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలేనని ఆయన అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం కొత్త చట్టాలు చేస్తున్నదని, అందులో భాగంగానే ఏ పంటకు గిట్టుబాటు రాని స్థితిని కల్పించి, వ్యవసాయం నుంచి రైతులను, రైతు కూలీలను దూరం చేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూలి పనులు చేసే క్రమంలో ప్రమాదాల్లో కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. వారి కుటుంబాలు తీవ్రంగా గుల్ల అవుతున్నాయని, కష్టజీవులు రక్షణ కోసం ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, రైతు సంఘం జిల్లా నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీ నాయకుడికి మేరుగు పరామర్శ


విజయభాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న నాగార్జున

చీమకుర్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడిని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ సుడెదల విజయభాస్కర్‌రెడ్డి ఇటీవల బైక్ అదుపు తప్పికిందపడగా గాయాలై ఒంగోలులోని హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం నాగార్జున ఆయనను పరామర్శించారు. పరామర్శలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, మండల ఉపాధ్యక్షుడు చీదర్ల శేషు, మాజీ ఎంపీటీసీ జి ఓబులరెడ్డి, వాకా కోటిరెడ్డి, నల్లూరి చంద్ర, కుంచాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అంతా కృషి చేస్తాం


ఇన్‌చార్జి నాగార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న దుడ్డు వినోద్, నాయకులు

మద్దిపాడు: మండలంలోని అన్నంగి గ్రామానికి చెందిన దుడ్డు వినోద్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా ఎంపిక చేస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో ఆయన సంతనూనతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి మేరుగు నాగార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈక్రమంలో నాగార్జున వినోద్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా దుడ్డు వినోద్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన బాధ్యతలు నెరవేర్చడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి నాగార్జునకు జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డికి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, గుడ్లపోతల రవి, నారా సుబ్బారెడ్డి, మేకల కృష్ణారెడ్డి, సన్నపురెడ్డి రమణమ్మ, పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, కంకణాల సురేష్, రాయపాటి వెంకట సుబ్బయ్య, వేముల సుబ్బారావు, తేళ్ల జగన్, పూనూరి రామయ్య, కావూరి పోలు తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపునకు విశేష స్పందన


మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మంగళవారం నిర్వహించిన మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. తొలుత జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మెడికల్ క్యాంపును లాంఛనంగా ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో వైద్య సేవలు అందించేందుకు వచ్చిన వైద్యులతో మాట్లాడి ఎటువంటి సేవలు అందిస్తున్నారని పరిశీలించారు. 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జిల్లా జడ్జి డి.దీనా, పోక్సో కోర్టు జడ్జి కానుగుల శైలజ తదితరులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంపులో ఎముకల పటుత్వ పరీక్షలు, ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలతో పాటు జనరల్ మెడిసిన్, కీళ్లు, నరాలు, గుండె, కంటి తదితర వ్యాధులకు సంబంధించిన నిపుణులు న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే న్యాయవాదులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు భాస్కరరావు మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు. టి.రాజ్యలక్ష్మి, పి.పూర్ణిమ, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు ఎస్.హేమలత, సీహెచ్‌వి రామకృష్ణ, జిలా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, జూనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో ఎన్నో ఉపయోగాలు


గాదెపాలెంలో మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిణి పి పావని

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): మండలంలోని ప్రతి రైతు కూడా ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి. పావని పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరు, మైనంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-క్రాప్ నమోదు యాప్ వీఏఏల వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉన్నందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న నువ్వులు, సరుగుడు, జామాయిల్, సుబాబులు, పండ్ల తోటలు, పశుగ్రాసం తదితర ఎటువంటి పంటలైన ఈ-క్రాప్‌లో నమోదులో చేయించుకుంటేనే వ్యవసాయశాఖలో అమలవుతున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ, సున్నా వడ్డీ మొదలగు పథకాలకు అర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, వీఏఏలు టి.మైన, జి.హరికృష్ణ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో భాస్కర్

ప్రధాన పంటకు పచ్చిరొట్ట పంటలు

చీమకుర్తి రూరల్: పచ్చిరొట్ట పంటల వలన ప్రధాన పంటకు ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ అన్నారు. మంగళవారం మంచికలపాడు, తొర్రగుడిపాడు సచివాలయ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

కొత్తపట్నం: అర్హత కలిగిన ప్రతి రైతు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని గాదెపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు కార్డులు తీసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో సీహెచ్ అజయ్ కుమార్, వీఏఏ శిరీష లక్ష్మణరావు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న జీసీడీవో హేమలత

కొత్తపట్నం: విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని సమగ్రశిక్ష ఒంగోలు జీసీడీవో కే హేమలత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోటుమాల గ్రామంలో ఉన్న కేజీబీవీ ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. శ్రద్ధగా చదవుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని, విద్యతోనే మన జీవితాలు బాగుపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలని ఆమె కోరారు. మొదటి నుంచే బాగా చదువుకుంటే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని తెలిపారు. అంతకుముందు ఆమె తరగతి గదులు, వంట రూము, బాతు రూములు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. అనంతరం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం వారు కేజీబీవీ ఉపాధ్యాయులకు నిర్వహించిన లైఫ్ స్కిల్స్ ఎగ్జామ్ జరిగే తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీరున్నిసా బేగం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన

నాగులుప్పలపాడు: సమాజంపై విద్యార్థులలకు కనీస అవగాహన అవసరమని ఎస్సై రజియా సుల్తానా అన్నారు. మంగళవారం అమ్మనబ్రోలు గ్రామంలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలు సమాజంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు అలాంటి చర్యల పట్ల ప్రశ్నించేతత్వం అలవరుచుకోవాలన్నారు. బాలికలు వారి అవసరాలపై పర్యవేక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రజియా సుల్తానా

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన..


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం: జీవితంలో స్థిరపడిన తరువాతే వివాహాలు చేసుకోవాలని ఎస్సై సుధాకర్‌బాబు అన్నారు. మండలంలో ఈతముక్కల గ్రామంలో మంగళవారం విద్యార్థునులతో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని సూచించారు. బాధ్యతగా చదువుకుని సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు చట్టాల గురించి వివరించారు. మిమ్మలను ఎవరైన ఇబ్బంది పెడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెంచు పున్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళులు


అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కేరళ మాజీ ముఖ్యమంత్రి, మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళు లర్పించారు. అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కోదాటి కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు నెరుసుల వెంకటేశ్వర్లు నాయకులు పి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు: అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగేలా అందరం కృషి చేద్దామని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం మండల పరిషత్ నిధులు పంచాయతీల నిధులు ఉపయోగించుకుని గ్రామాల్లో ముఖ్యమైన పనులు చేసుకోవాలన్నారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అందరం కలిసి మండల అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి జ్యోతి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఏఓ వరప్రసాద్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రక్తకణాల సేకరణతో క్యాన్సర్‌కు చికిత్స


ప్రిన్సిపాల్‌కు ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు సిటీ: క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, ధాత్రి స్వచ్ఛంధ సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో రక్త కణాల నమూనాల సేకరణ క్యాంప్ రెండు రోజుల పాటు జరిగింది. కళాశాలలో రెండో ఏడాది, మూడో ఏడాదిలో చదువుతున్న విద్యార్థుల నుంచి రక్తకణాల నమూనాలను స్వీకరించారు. మొత్తం 1100 మంది వారి నమూనాలను స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ఇచ్చారు. ధాత్రి బ్లడ్ స్టెమ్‌సెల్ డోనర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి నమూనాలను సేకరించి వారి గ్రూపులను భద్రపరుస్తుంది. క్యాన్సర్ పేషంట్లకు రక్తకణాలు అవసరమైనప్పుడు గ్రూప్ మ్యాచ్ అయితే వారి నుంచి రక్త కణాలు డొనేట్ చేయిస్తారు. క్విస్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ధాత్రి వారితో కలిసి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా నమూనాలను ఇచ్చిన విద్యార్థులను, ధాత్రి సభ్యులు లావణ్య, రాజ్ కిరణ్, జోత్స్న, వివేక్ డేన్జిల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అభినందించారు. గతంలో ఇలా నమూనాలు సేకరించి బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవ్వడంతో క్విస్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆరేళ్ల చిన్నారి ప్రాణం కూడా కాపాడినట్లు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావుకి ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేశారు.

వీసీకి ఏకేయూ ఉద్యోగుల అభినందనలు


వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న యూనివర్సిటి ఉద్యోగులు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ఇన్‌చార్జి ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పదవీ బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు, ఉద్యోగులు శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలోని వీసీ చాంబర్‌లో జరిగిన అభినందనల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మూర్తి ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహించిన సంవత్సర కాలంలో విద్యాభివృద్ధి కోసం, ఉద్యోగుల సంక్షేమం కోసం, నూతన భవనాల నిర్మాణం కోసం, పరిపాలన పరమైన సౌలభ్యం కోసం ఆయన చేపట్టిన విధాన పరమైన నిర్ణయాలు ప్రశంసనీయమైనవి పేర్కొన్నారు. పేర్నమిట్ట క్యాంపస్‌లో రెండు భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రొఫెసర్ మూర్తి ఎంతో మేధా సంపత్తి కలిగిన వ్యక్తి అని అటువంటి ఉన్నత ఆశయాలు కలిగిన అధికారి భవిష్యత్ బంగారుబాట కావాలని ఏ.కే.యూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలా మణి ఆకాంక్షించ్చారు. ఓఎస్డీ ప్రొఫెసర్ రాజ మోహన్ మాట్లాడుతూ ఆంధ్ర కేసరి యూనివర్సిటీని అభివృద్ధి బాటలో నడిపించెందుకు ప్రొఫెసర్ మూర్తి చేసిన కృషి అభినందనీయమని ఆయన అన్నారు. రెగ్యులర్ ఉప కులపతిగా కొనసాగితే కొత్తగా ఏర్పడిన ఏకేయూ సైతం రాష్ట్రంలో అభివృద్ధి చెందిన పెద్ద యూనివర్సిటీల సరసన నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉద్యోగులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బొకేలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించ్చారు. ఈ కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ సోమశేఖర్, ఏసీఈ డాక్టర్ భారతి దేవి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ గంగాధర్, డీన్ డాక్టర్ కేవీఎన్. రాజు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హర్ష ప్రీతం దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com